క్లుప్తంగా

యువకుడికి తీవ్ర గాయాలు

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు బైక్ కింద పడి యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం పట్టణ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జమిచెడ్‌కు చెందిన పరశురాముడు గురువారం ఉదయం బైక్‌పై గద్వాల వైపు వస్తున్నాడు. గద్వాల పట్టణ శివారులో బైక్ అదుపుతప్పి ఎదురుగా ఉన్న చెట్టుకు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్సనిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పాముకాటుకు బాలుడి మృతి

కేటీ దొడ్డి: పాము కాటుకు వల్ల బాలుడు మృతి చెందిన సంఘట కేటీదొడ్డి మండల కేంద్రంలోని గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఈరన్న గోవిందమ్మలకు ఇద్దరు సంతానం. రెండో కుమారుడు గురువారం బీమేష్ (6) ఉదయం ఇంటి వెనకాల ఆడుకుంటున్న సమయంలో అక్కడ పాము కరవడంతో గుర్తించిన కుటుంబ సభ్యులు రాయచూర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

గద్వాల క్రైం: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందడంతో వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు నిరసన వ్యక్తం చేసిన సంఘటన జిల్లా ప్రభుత్వాస్పత్రిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. బంధువుల కథనం మేరకు.. ధరూర్ మండలం అల్లపాడుకు చెందిన నర్సిరెడ్డి(51) ఉదయం అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్సకోసం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు సకాలంలో వైద్య సేవలు అందించడంలో జాప్యం చూపారు. సాయంత్రం పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో వైద్యులు చికిత్సను అందించారు. చికిత్స పొందుతూనే నర్సిరెడ్డి మృతిచెందాడు. తండ్రి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుమారుడు శేఖర్‌రెడ్డి ఆరోపించాడు. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్‌ను వివరణ కోరగా.. చికిత్స సమయంలో రోగికి గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు పేర్కొన్నాడు.

ప్రచారంలో నాయకులు

- అయిజ మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి విజేయుడుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
- ప్రజలు ఆదరిస్తే ప్రతి గడపకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు అన్నారు. ఇటిక్యాల మండలంలోని షేకుపల్లి, సాసనూలు, బట్లదిన్నె, బుడ్డారెడ్డిపల్లి గ్రామాల్లో నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
- అలంపూర్ మండలంలోని ఊట్కూర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి విజేయుడుకు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారు.
- కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్‌కుమార్ మానవపాడు మండలంలోని నారాయణపురం, పల్లెపాడు, బోరవెల్లి, జల్లాపురం చందూరు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు.
- భైరంపల్లి, గొందిమల్ల, మున్సిపాలిటీ పరిధిలోని ఇమాంపూరంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్ కుమార్ సతీమణి మహాలక్ష్మి ప్రచారం చేశారు.
- బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి అతిఖుర్ రహ్మాన్ గురువారం జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని గుంటిపల్లి, అనంతపురం, బస్సచెర్వు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
- తెలంగాణను కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రంగా చేద్దామని మాజీ ఎంపీ మందా జగన్నాథం అన్నారు. అలంపూర్ పట్టణంలోని టూరిజం హోటల్‌లో మాజీ ఎంపీ మందా జగన్నాథం, ఏఐసీసీ అబ్జర్వర్ కర్ణాటక ఎమ్మెల్యే రఘుమూర్తితో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.
- గద్వాల జిల్లా కేంద్రంలోని 11వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి సరిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎంపీ మల్లురవి పాల్గొని కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు.
- బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రసన్నకుమార్ ఇటిక్యాల మండలంలోని శివనంపల్లి, పెద్దదిన్నె, ఎం.ఆర్ చెర్వు, గోపల్‌దిన్నె, ఇటిక్యాల, మునుగాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.
- జిల్లా కేంద్రంలోని తేరుమైదానంలో శనివారం సాయంత్ర 4గంటలకు సింహగర్జన సభను నిర్వహించనున్నట్లు అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఎమ్మెల్యే అభ్యర్థి రంజిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన గట్టు భువనేశ్వరి

గట్టు: దివంగత నేత, గద్వాల మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు సతీమణి భువనేశ్వరి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె కుమారులు న్యాయవాది వెంకటరమణ, సాయి, సీనియర్ సిటిజన్ మోహన్‌రావులు తిరుపతయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి, సాధారంగా పార్టీలోకి ఆహ్వానించినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

హ్యాట్రిక్ సీఎం కేసీఆరే

- ఓటర్లను చైతన్యం చేయాలి
- బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల అర్బన్/ధరూర్/కేటీదొడ్డి/గట్టు: ఎవరెన్ని కుయుక్తులు పన్నినా, ఎన్ని వేషాలు వేసినా, ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా, తెలంగాణ ప్రజానీకం కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్య మంత్రిగా చూడాలని ఆశగా.. ఆసక్తిగా ఉన్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ధరూర్ మండల కేంద్రంలో మండల స్థాయి బూత్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ వారం రోజులు ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పని చేయాలని, ప్రస్తుతం చేస్తున్న పనికి రెట్టింపుగా పని చేయాలని సూచించారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఓటర్లకు కారు గుర్తుకు ఓటు వేసేలా వివరించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. వార్డుల వారీగా కమిటీలు వేసుకుని ప్రచారాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే మోసపూరిత మాటలను నమ్మవద్దని, వాటిని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈ నెల 30న జరిగే ఓటింగ్ శాతాన్ని గతం కంటే మరికొంత పెంచేందుకు కృషి చేయాలన్నారు. అన్నింటికంటే ప్రధానంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జ్ రాకేష్, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్ శ్రీధర్, ప్రభాకర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, భీంరెడ్డి, వెంకటేష్ నాయుడు, శ్రీరాములు, చంద్రశేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, సంజీవ్, అబ్రహం, భరత్, రాములు, అంజి సాగర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు

కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు తప్పవని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గువ్వలదిన్నె, తూర్పు తండా, తోటతండా, పూజారితండా గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకటి రోజులు తప్పవన్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే నట్టేట ముంచుతారని చెప్పారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, జిల్లా నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్, సర్పంచు మహాదేవి ఉన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిక..

మండలంలోని గువ్వలదిన్నెలోని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులు మాజీ సర్పంచు నాగప్ప ఆధ్వర్యంలోని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో 53 మంది గులాబీ గూటికి చేరారు. వారికి గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కేటీదొడ్డిలో బూత్‌కమిటీ సమావేశం

తెలంగాణ ప్రభుత్వం ద్వారా అభివృద్ధి చేసిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటిదగ్గరకు వెళ్లి వాటిని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. కేటీదొడ్డి మండల కేంద్రంలో బూత్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసేలా ఓటర్లను చైతన్యం చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన వారిని ప్రచారంలో భాగస్వాములు చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఎన్నికల ఇన్‌చార్జ్ రాకేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం

బీఆర్‌ఎస్ పార్టీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబు రామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్‌లు తెలిపారు. గట్టు మండలం ఆలూరులో సర్పంచు మల్లమ్మతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గద్వాల ఎమ్మెల్యేగా బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి మరో అవకాశం కల్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆనంద్‌గౌడు, బీఆర్‌ఎస్ నాయకులు రాముశెట్టి, మేస్త్రీ తిమ్మప్ప పాల్గొన్నారు. బల్గెరలో జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతునాయుడు, ఎంపీటీసీ రూపావతిలు ప్రచారం చేశారు. గట్టులో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్ అన్నారు. పట్టణంలోని 35వ వార్డులో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ముబీన్, సల్మాన్ ఉన్నారు.



సమావేశానికి హాజరైన ధరూరు మండల బూత్ కమిటీల సభ్యులు



గద్వాల పట్టణంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తనయుడు సాకేత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

తనిఖీలో మద్యం, నగదు పట్టివేత



పోలీసులు అదుపులోకి తీసుకున్న మద్యం

గద్వాల క్రైం: మద్యం తీసుకెళ్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. గురువారం సాయంత్రం గద్వాల మండలం పూడూరుకు చెందిన కృష్ణ రూ.30 వేల విలువ గల మద్యం తీసుకెళ్తున్నట్లు సమాచారం మేరకు పట్టణ శివారులో తనిఖీ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అలంపూర్: తనిఖీల్లో మద్యం పట్టుబడినట్లు ఉండవెల్లి ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. అలంపూర్ చౌరస్తా నుంచి అలంపూర్‌కు వెళ్లే మార్గంలో తనిఖీ నిర్వహించారు. కర్నూల్ జిల్లా మునగాలపాడుకు చెందిన మద్దిలేటిగౌడ్ బైక్‌ను తనిఖీ చేయగా అతని వద్ద 33క్వాటర్ బాటిళ్లు లభించినట్లు తెలిపారు. 5.9లీటర్ల మద్యం విలువ రూ.6900 ఉంటుందని పేర్కొన్నారు. మద్యంతో పాటు బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: కారులో తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. పెద్దదిన్నెకు చెందిన బాలేశ్వరుడు, జైనుద్దీన్‌లు కారులో పొగాకు కంపెనీ నుంచి పెద్దదిన్నె వైపు వెళ్తుండగా, మునుగాల స్టేజీ సమీపంలో పోలీసులు తనిఖీ చేశారు. కారులో రెండు కాటన్ల మద్యం 17.28 లీటర్ల (విలువ రూ.19,008) పట్టుకున్నట్లు తెలిపారు. మద్యంతో పాటు కారును సీజ్ చేసి పీఎస్‌కు తరలించి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మానవపాడు: కొర్విపాడు స్టేజీ వద్ద కర్నూల్ బస్సు కోసం వేచి చూస్తున్న వ్యక్తిని పోలీసులు తనిఖీ చేసి రూ.2 లక్షలు పట్టుకున్నట్లు ఎస్ రాములు గురువారం తెలిపారు. వ్యక్తి తమిళనాడు రాష్ట్రం మదురైకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఎటువంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. సరైన పత్రాలు తీసుకుని వస్తే ఫిర్యాదు కమిటీ ముందు సమర్పిస్తామని తెలిపారు.

మల్దకల్: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా మల్దకల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీకి ఆరుగురు నాలుగు ద్విచక్ర వాహనాలపై మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. మద్యంతో పాటు 4 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. మద్యం విలువ రూ.లక్షా 47 వేలు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గట్టు: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బల్గెర గ్రామ శివారులో ఎక్సైజ్ ఎస్ఐ రాజేందర్ బృందం మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్ తెలిపారు. ఎక్సైజ్ సీఐ కథనం మేరకు.. బుధవారం రాత్రి గట్టుకు చెందిన గురునాయుడు, మిట్టదొడ్డికి చెందిన మారెప్పలు అక్రమంగా ద్విచక్ర వాహనంపై మద్యం సీసాలను తరలిస్తుండగా, తనిఖీలో భాగంగా వారిని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అయిజ: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం రాత్రి మండలంలోని చిన్నతాండ్రపాడు చౌరస్తాలో ఎక్సైజ్ అధికారులు రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 25.9 లీటర్ల విస్కీని పట్టుకున్నారు. మద్యంతో పాటు మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని వేణిసోంపురానికి చెందిన లక్ష్మన్న, చిన్న తాండ్రపాడుకు చెందిన ఎర్రన్న, సంద్యపోగు మద్దిలేటిలపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్ తెలిపారు.

వ్యాధుల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న డీపీఎంఓ మల్లికార్జున్

గద్వాల అర్బన్: హెచ్ఐవీ, టీబీ తదితర వ్యాధుల పట్ల తప్పనిసరిగా జాగ్రత్తలను పాటించాలని డీపీఎంఓ మల్లికార్జున్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో హోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి పైగా దగ్గు, జ్వరం, ఆకలి మందగించడ, బరువు తగ్గడం టీబీ లక్షణాలు అని, వెంటనే అలాంటి వ్యక్తికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరాంరెడ్డి, సిబ్బంది, హోప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఉదయ్ ఉన్నారు.



సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్లు ఇర్షాద్, రాజు

మానవపాడు: వాతావరణంలో కలిగే మార్పుల వల్ల మలేరియా, డెంగీ, మెదడువాపు వ్యాధి, రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఇర్షాద్, రాజు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఏబీఎచ్‌ఏ కార్డును జనరేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రిజ్వానా తస్లీర్, సత్యానారాయణ, చంద్రన్న, ఫార్మాసిస్ట్ తిరుమల్‌రావు, మాబమ్మ, ఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

అరణ్ణేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పూజలు



ధరూరు: మండలంలోని కోతులగిద్ద శివారులోని అరణ్ణేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం తెల్లవారు జామున మహిళలు, చిన్నారులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం గుట్టపై ఆలయం ముందు చిన్నారులు, భజన మండలి సభ్యులు ప్రత్యేక భజనలు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు తెలిపారు.

శివాలయంలో అఖండ భజన



అయిజ: కార్తీకమాసంను పురస్కరించుకొని మండలంలోని బింగుదొడ్డిలో గురువారం భక్తులు 24 గంటలపాటు అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యాలో హాజరయ్యారు. భజన కీర్తనలతో ఆలయప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో భజనమండలి సభ్యులు అల్లం వెంకటేష్, దొడ్డన్న, ఉరుకుంద, రామాంజనేయులు, కిష్టన్న, నరసింహులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



మల్దకల్: గూడ్సు వాహనాలలో ప్రయాణికులను చేరవేస్తూ ప్రజల ప్రాణాలతో ప్రైవేటు వాహనదారులు ప్రమాదాలకు గురిచేస్తున్నారు. ప్రతినిత్యం కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి మల్దకల్ మండలంలోని వివిధ గ్రామాలకు కూలీలను ఎక్కించుకుని కూలీపనుల నిమిత్తం వస్తున్నారు. ఒక్కొక్క వాహనంలో దాదాపు 20నుంచి 50మందికి పైగా ప్రయాణికులను చేరవేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ





వాహనంపై ఊరేగుతున్న కాళికామాత శిలా విగ్రహం, ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అయిజ: మండల కేంద్రంలోని కాళమ్మపేటలో నూతనంగా నిర్మించిన కాళికాదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ పూజ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా గురువారం వేదపండితులు వేదమంత్రాలు జపిస్తూ పూజలు చేశారు. ఉదయం సుప్రభాతం, షోడశపచార పూజ, దేవతా విగ్రహాలకు అభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం కాళికామాత అమ్మవారి శిలా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో పట్టణంలో ప్రధానరోడ్లపై ఊరేగించారు. వివిధ వేషధారణలతో కళాకారులు అలరించారు. అనంతరం యంత్రాభిషేకం, రుద్రహోమం, దుర్గాహోమం, కళాహోమం, మహామంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద కార్యక్రమాలను వేదపండితులు నిర్వమించారు. భజన బృందం కళాకారులు భక్తిగీతాలు ఆలపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు అవినీతి పార్టీలు



మాట్లాడుతున్న కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం శ్రీరాములు, వేదికపై డీకే అరుణ, బీజేపీ అభ్యర్థి శివారెడ్డి

గద్వాల రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు అవి నీతి పార్టీలని ఆ పార్టీలు పూర్తిగా కుటుంబ పాలన కొనసాగిస్తూ మిగిలిన సబ్బండ వర్గాల ప్రజలను మోసం చేస్తున్నాయని కర్ణాటక బీజేపీ నాయకులు, మాజీ ఉప ముఖ్యమంత్రి శ్రీరాములు ధ్వజమెత్తారు. గురువారం గద్వాల పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో వాల్మీకి మహాగర్జన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. కర్ణాటకలో 40ఏళ్లుగా పోరాటం చేస్తే బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చగా, ప్రస్తుతం కర్ణాటకలో బోయ కులస్తులు 16మంది శాసనసభ్యులుగా ఉన్నారని కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి శ్రీరాములు అన్నారు. రాష్ట్రంలో మొత్తం 119 అసెంబ్లీ నియోకవర్గాలు న్నాయని ఇందులో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్క బోయవాల్మీకులకు ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వలేదని, కేవలం గద్వాలలో బీజేపీ అరుణమ్మ ఆశీస్సులతో బోయకులస్తులకు ఎమ్మెల్యే టికెట్టు వచ్చిందన్నారు. ఇదంతా రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ చలువ వల్లే మన వర్గానికి దక్కిన ఫలితమన్నారు.

దొంగలంతా ఏకమయ్యారు: డీకే అరుణ

గద్వాలలో అరుణమ్మ లేదు, అరుణమ్మ అక్కడపోయింది, ఇక్కడ పోయిందనే దుష్ప్రచారం చేస్తూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలలోని దొంగలు ఏకమై గద్వాలను దోచుకోవడానికి వస్తున్నారని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండకపోతే గద్వాల ప్రాంతం దోపిడీకి గురవుతుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు మాజీ మంత్రి డీకే అరుణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల తరపున నిలబడిన ఇద్దరు అభ్యర్థులు కూడ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారేనని తెలిపారు. బీజేపీకి ఓటేసి బోయశివారెడ్డిని గెలిపించాలని కోరారు. రాంచంద్రారెడ్డి, రాములు, వీరుబాబు, రామాంజనేయులు, దేవదాసు, వెంకట్రాములు పాల్గొన్నారు.

వాల్మీకులను ఆదుకున్నది బీఆర్‌ఎస్సే



మాట్లాడుతున్న చిన్నకృష్ణయ్య

అలంపూర్: వాల్మీకులకు అండుకున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అని ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు, ఐక్యవాల్మీకి బోయ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయుడు అన్నారు. అలంపూర్ పట్టణంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలోని వాల్మీకులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం సహకారం అందించిందన్నారు. రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి తీర్మానం చేసి కేంద్రానికి పంపిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం తీర్మానం చేయకపోయిన సీఎం కేసీఆర్ తీర్మానం చేసి పంపించారన్నారు. నియోజకవర్గంలోని అలంపూర్ చౌరస్తాలో వాల్మీకి భవన్ కోసం 10 సెంట్ల స్థలం కేటాయించి భవన నిర్మాణానికి రూ. 25 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అయిజ మండలంలో 10 సెంట్ల స్థలం కేటాయించి రూ. 25 లక్షలు కేటాయించిందన్నారు. వాల్మీకులకు తోడ్పాటును అందించిన బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతుగా ఉంటామన్నారు. సమావేశంలో వాల్మీకి నాయకులు శేషన్న నాయుడు, మద్దిలేటి నాయుడు, వెంకటేశ్వర్ల నాయుడు ఉన్నారు.

మౌలిక వసతులు పరిశీలించిన ఈఈ



ఉండవెల్లిలోని పాఠశాలను పరిశీలించిన ఈఈ

ఉండవెల్లి: మండలంలోని మండల కేంద్రం, తక్కశిల, ప్రాగటూరు, మారమునగాల, శేరుపల్లె గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతుల డివిజనల్ అధికారి(ఈఈ)విజయభాస్కర్ పరిశీలించారు. గురువారం మండల కేంద్రం, తక్కశిలలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించారు. శేరుపల్లె, ప్రాగటూరులో బాత్రూంలో మరమ్మతులు చేయించారు. మారమునగాలలో ర్యాంపును ఏర్పాటు చేయించారు. అనంతరం మన ఊరు-మన బడి పనులను పరిశీలించారు.

కర్ణాటకలో ప్రతి పథకం అమలవుతోంది

– కన్నడ హీరోయిన్ భావన



ధరూర్‌లో మహిళా ఆశీర్వాద సభలో కన్నడ నటి భావన

ధరూరు: కర్ణాటకలో ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని, తెలంగాణలో కర్ణాటక ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ అబద్ధాలు చెప్పి ప్రజల నుంచి ఓట్లు దండుకునేందుకు ప్రయత్నిస్తోందని, వారి మాటలు నమ్మవద్దని చెప్పేందుకే తాను ఇక్కడికి వచ్చానని కన్నడ హీరోయిన్ భావన అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధరూరు, కేటీదొడ్డి మండలాలను కలిపి మహిళా ఆశీర్వాద సభను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సరితను బలపరిచేందుకే తాను ఈ సభకు హాజరైనట్లు ఆమె తెలిపారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి



నాసా కిట్లు పంపిణీ చేస్తున్న భాస్కర్‌రెడ్డి

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య స్కూల్‌లోని విద్యార్థులకు గురువారం ఏజీఎం భాస్కర్‌రెడ్డి నాసా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని, సైన్స్ పరిజ్ఞానంతో దేశాన్ని అభివృద్ధి వైపు నడిపేందుకు కృషి చేయాలని సూచించారు. అంతరిక్షం గురించి మానవులకు రవ్వంత కూడా తెలియదని, రాబోయే రోజుల్లో పరిజ్ఞానం మరింత పెరగనుండటంతో అంతరిక్షాన్ని ఇప్పుడున్న దానికంటే ఎక్కువగా తెలుసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ మేరకు పాఠశాల యాజమాన్యం శ్రీవిద్య, శ్రీధర్ మాట్లాడుతూ ఈ కిట్లలో విద్యార్థుల ప్రాజెక్టుకు అవసరమైన సమాచారం, మార్గదర్శకం ఉంటడంతో వారికి ఎంతో ఉపయోగపడతాయన్నారు.

సత్యసాయిబాబా జయంతి వేడుకలు



సాయిబాబా జయంతి వేడుకల్లో భక్తులు

కొత్తకోట: భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబ 98వ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక భజన మండలి ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు అందజేయడంతో పాటు పట్టణ శివారులో గల సాయిబాబా ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. వనపర్తి జిల్లా పామిరెడ్డిపల్లి గ్రామంలో గల వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు.

ఆత్మకూర్: భగవాన్ శ్రీశ్రీ సత్యసాయిబాబా జయంతి వేడుకలను ఆత్మకూర్‌లోని సాయి మందిరంలో భక్తులు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున 5గంటలకు ఓంకార సుప్రభాతం, జ్యోతులచే ర్యాలీని పురవీధులగుడా నిర్వహించారు, ఉదయం 6.30గంటలకు పతాకావిష్కరణ, 8గంటలకు సర్వ ధర్మ పతాకావిష్కరణ, 9గంటలకు బాబా వారి వ్రతకల్పం, మధ్యాహ్నం అన్నదానం, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.